ప్రేమకోసం ప్రాక్టికల్స్ మొదలెట్టిన అతడి ప్రేమ ఫలించిందా?

# మొదటి మాట

గోగుమళ్ళ కవిత

కథ

"నేను అర్జంటుగా ఎవర్నైనా ప్రేమించాలి. ఏదైనా సలహా కొట్టు గురూ!" ఇనుపచువ్వల్లా నిటారుగా నిల్చున్న జుట్టును సవరించుకుంటూ అడిగాడుకుమార్.


"నీ మొహానికి అదొక్కటే తక్కువ, అయినా ముళ్లపంది మొఖం ఏ అమ్మాయికి నచ్చుతుంది చెప్పు? ఇంతటితో ఆ ఆలోచన మానేయ్" తేలికగా సలహా ఇచ్చాడు కుమార్‌ను కొన్ని సంవత్సరాలుగా భరిస్తున్న స్నేహితుడు భరణి.

అదికాదురా, ఏ సినిమా చూసినా, ఏ పుస్తకం చదివినా, అసలు ప్రపంచంలో ఎక్కడ చూసినా ప్రేమే కన్పిస్తుందిగదా! అసలదేంటో, ఎలా వుంటుందో, నాకూ తెలుసుకోవాలని వుంది. అందుకే ఓ అమ్మాయిని లైన్లో పెట్టాలంటే ఏం చేయాలో, అనుభవం వున్నవాడివికదా, నాకూ చెప్పరా! భరణి గడ్డం పట్టుకుని ఊపేస్తూ అడిగాడు కుమార్.

ఇంతకూ అమ్మాయి రెడీగా వుందా? ఇక ఎంతకూ జీడిబంకలా తగులుకున్న కుమార్ వదలడని నిశ్చయించుకుని విషయంలోకి దిగాడు భరణి.

లేదనుకో! నువ్వు సలహాలిస్తే నాకు నచ్చిన అమ్మాయిని అప్రోచ్ అవుతాను సిగ్గుగా తలదించుకుని చెప్పాడు కుమార్.

ఏ మగాడైనా అమ్మాయిని పరిచయం చేసుకునేటప్పుడు నేను నిన్ను ప్రేమిస్తున్నాను అనో, నువ్వంటే నాకిష్టం అనో అంటాడు. ఇదంతా ఓల్డ్ ఫ్యాషన్. అందరూ నడిచే దారిలో నువ్వూ నడిస్తే వెరైటీ ఏముంది? నువ్వు ఆ అమ్మాయితో మాట్లా



డే మొదటిమాటే ఆ అమ్మాయిని బాగా ఆలోచింపజేసేలా వుండాలి. ఒక్క మాట తోనే ఆ అమ్మాయి గుండెల్లో ప్రేమ పొంగి పోతో మరుక్షణమే తలమునకలయ్యేంత ప్రేమలో పడిపోవాలి. ఏమంటావ్? తన ప్రసంగాన్ని ఆపి కుమార్‌ను చూపి ఎలా వుందని కళ్లెగరేశాడు భరణి.

నేనేమంటాను? ఈ రేడియో ఏదో

"కొత్తగా వెరైటీగా, తమాషాగా వున్నట్టుంది" అయోమయంగా అన్నాడు కుమార్.

"అవును మరి. 'వెరైటీ' అనేది ఇక్కడ చాలా అవసరం. ఇక నువ్వు నీకు నచ్చిన అమ్మాయి కనబడగానే,

'నాకు జీవితాంతం మీ బెడ్‌పైన పడుకోవాలని వుంది' అనో,

'నాకు కలగబోయే బిడ్డలకు మిమ్మల్ని తల్లిగా చూడాలని వుంది' అనో,

'శుభలేఖలో నా పేరుకింద మీ పేరును చూసుకోవాలని వుంది' అనో అనేయ్.

బస్. ఇక చూస్కో. ఆ అమ్మాయి తన ప్రేమ జల్లులో నిన్ను తడిపేస్తుంది. వెంటనే నీ బుగ్గమీద ముద్దుపెట్టుకున్నా నువ్వు ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు" చెప్పడం ఆపి ప్రక్కకు తిరిగి చూసిన భరణి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

అప్పటికే కళ్లు తాటికాయలంత చేస్కుని, పెదవులను చెవుల్దాకా సాగదీసి, తల పైకెత్తి, ఆకాశంలో పరుగెత్తే మేఘాల్లో చూపుల్ని గుచ్చి ఊహల్లో తేలిపోతున్నాడు కుమార్.

○ ● ○

కొట్లో కొన్న స్వచ్ఛమైన ఆముదాన్ని తలనిండా పట్టించి, పెద్ద పళ్ల దువ్వెనతో, తన శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని దువ్వి దువ్వి చివరకు ఎలాగైతేనేం ఇనుప చువ్వల్లాంటి వెంట్రుకలను కుదురుగా దువ్వి, విజయోత్సాహంతో దువ్వెనను గాలిలోకి విసిరాడు కుమార్. అతని శ్రమకు నిదర్శనంగా చెవుల ప్రక్కలనుండి చెంప మీదికి కారుతున్న ఆముదమే సాక్ష్యం.

తర్వాత పాండ్స్ పౌడర్ డబ్బా అందుకుని సగం ఖాళీచేసి, చివర్లో తన కాలేజీడేస్‌లో కొన్న చలువ కళ్లద్దాలు దుమ్ము దులిపి కళ్లకు తగిలించాడు.

వారెవా! ఏం వున్నావ్ గురూ! నీ ముందు నాగార్జున, వెంకటేష్ బలాదూర్! తనని తానే అద్దంలో చూసుకుని మురిసిపోతూ స్వగతంలో అనుకుని, 'హలో గురూ ప్రేమకోసమేరోయ్ జీవితం' గట్టిగా పాడుకుంటూ ఫ్రెండ్‌ను బతిమిలాడి తీసుకున్న బైక్‌ని ఒక్క కిక్‌తో స్టార్ట్‌చేసి ఉమెన్స్ కాలేజ్‌వైపు దూసుకెళ్లాడు కుమార్.

ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా ఒక పాన్‌షాప్ దగ్గర బండి ఆపుకుని కాలేజీ ఎప్పుడొదులుతారా అని గుంటకాడ నక్కలా కాచుక్కూర్చున్నాడు.

కాలేజీ వదిలారు. అమ్మాయిలంతా రంగురంగుల సీతాకోక చిలుకల్లా గుంపులు గుంపులుగా బైటకొస్తున్నారు.

కుమార్‌కు టెన్షన్ పెరిగిపోయింది. అంతమంది అమ్మాయిల్ని ఒక దగ్గరే చూడడం అతనికి కొత్త కాకపోయినా, వాళ్లందరిలో తాను ప్రేమించబోయే అమ్మాయివుందనే ఆలోచనే అతన్ని ఒక క్షణంకూడా కుదురుగా నిలువనీయడంలేదు.

పంజాబీ డ్రెస్‌లోవున్న అమ్మాయిలు, మిడ్డీలో వున్న అమ్మాయిలు, జీన్స్‌లో వున్న అమ్మాయిలు, ఓణీ కట్టిన అమ్మాయిలు, చీరలు సింగారించిన అమ్మాయిలు, అమ్మాయిలే అమ్మాయిలు, అబ్బబ్బ ఎన్నెని వెరైటీ కలర్స్! అబ్బాయిలకంటే అమ్మాయిలకున్న ఎడ్వాంటేజ్ ఒకటుంది. అబ్బాయిలైతే వేస్తే పాంట్, షర్ట్ వేయాలి, అదీ కాకపోతే కుర్తా పైజమా వేయాలి. కేవలం రెండే రెండు

డ్రస్‌లు. అదే అమ్మాయిలైతే, మినీ, మిడీ, జీన్స్, పంజాబీ డ్రెస్, ఓణీ, చీర హబ్బో లెక్కలేనన్ని డ్రస్సులు.

ఇన్ని రకాల డ్రస్సులేస్తే మరి అమ్మాయిలు అందంగా వుండక ఏం చేస్తారు? తనని తానే ప్రశ్నించుకుని ఆలోచనల్లోంచి వాస్తవంలోకి వచ్చి కాలేజివైపు చూశాడు.


ఎదురుగా కాలేజీ గేటు మూస్తున్న వాచ్‌మాన్ కన్పించాడు. ఇది కలా నిజమా! ఇప్పుడేగా తాను అంతమంది అమ్మాయిలను చూసింది. ఇంతలోనే ఏమయ్యారు? వెంటనే వాచీ చూసుకున్నాడు కుమార్. సాయంత్రం ఆరుగంటలౌతోంది.

తానింతసేపు ఆలోచిస్తూ కూర్చున్నాడా? తన తెలివితక్కువ తనానికి తలమీద కొట్టుకుని, హడావుడిగా బైక్ స్టార్ట్‌చేసి మెయిన్‌రోడ్‌మీద పడి కళ్లను చేటలంత చేసుకుని, ఆబగా అమ్మాయిల వేట ప్రారంభించాడు కుమార్.

కుమార్ కాలు బలంగా బ్రేక్ నొక్కడంతో బైక్ 'క్రీచ్'మంటూ స్కిడ్ అవ్వబోయి ఆగింది. ఒక్కపక్క బ్రేక్ పడిపోకుండా బ్యాలెన్స్ చేస్తూ, రోడ్డు ప్రక్కగా తన ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న ఓ చుడీదార్ అమ్మాయిని చూసి, పెదవులమీదికి ప్లాస్టిక్ నవ్వును బలవంతంగా తెప్పించుకున్నాడు కుమార్.

అమ్మాయి క్రమంగా దగ్గరవుతోంది. కుమార్ కాళ్లుకూడా క్రమంగా వణకడం ప్రారంభించాయి. వణుకు బైటకి కన్పడనివ్వకుండా కాళ్లను బలంగా నేలకితన్నిపెట్టాడు. నుదుటిమీద చెమటపట్టి, ఆముదం ప్లస్ చెమటా రెండూ కలిసి గంగా తిమనల్లా పోటీపడి ముఖం మీంచి పారుతున్నై. దానికి తోడు అరగంట క్రితం తల కొట్టుకున్నప్పుడు రెండు ఇనుప వెంట్రుకలు గాల్లో రెల్లుగడ్డి పరకల్లా లేచి మంచున్నాయి. ఆ గెటప్‌లో అప్పుడే బ్యాంక్ దోపిడీ చేసి హడావిడిగా పారిపోయి వస్తున్న దొంగలాగా వున్నాడు కుమార్. కానీ, ఇవేమీ గమనించు

## చదివించండి



అమెరికా, బ్రిటన్, స్విట్జర్లాండ్, జర్మనీ, జపాన్‌లాంటి దేశాల్లో అక్షరాస్యత పూర్తిగా వందశాతం వుంటుందనే విషయాన్ని ఎంతో ముచ్చటగా వారు చెప్పుకుంటారు! మన దేశంలో అక్షరాస్యత యాభై శాతందాకా వుంటుంది! ఈ విషయంలో మనం పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పోలిస్తే నయమే! ఆ దేశాలలో అక్షరాస్యత 35 శాతం దాటలేదు ఇంకా! అలాగే సగటు మనిషి జీవనకాలం కూడా. అమెరికా, బ్రిటన్‌లాంటి దేశాలలో 80 సంవత్సరాలదాకా వుంటే మన దేశంలో 61 సంవత్సరాలు — బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో 55, 59 సంవత్సరాలూ వున్నాయి! అంటే మనం అభివృద్ధిచెందిన దేశాలతో పోటీ పడాలంటే ఎంత కష్టపడాలోకదా! — జూపిటర్

కునే పరిస్థితిలో లేదు అతను.

ఆ అమ్మాయితో చెప్పాల్సిన డైలాగ్‌ని మనసులోనే మననం చేసుకున్నాడు. భరణే మో తనకు మూడు డైలాగులు చెప్పాడు. ఈ మూడింట్లో ఏ డైలాగ్ చెప్తే ఈ అమ్మాయిని ఇం[ప్రెస్ చెయ్యొచ్చు. మళ్లీ ఆలోచనల్లోకి వెళ్లకోయి — ఆ అమ్మాయి ఎక్కడ తనని దాటి వెళ్లిపోతుందో అని కంగారుపడి, మదనపడి చివరికి మొదటి డైలాగే కొట్టాలని స్థిరంగా నిర్ణయించుకున్నాడు.

ఆ చుడీదార్ అమ్మాయి కుమార్ ప్రక్కగా వచ్చేసింది.

"సెక్స్ యూజ్ మీ"! ఎక్స్‌క్యూజ్‌మీ అని అనాలనుకున్న పదం భయంతో పుట్టిన వణుకికి ఆ విధంగా బైటికొచ్చింది.

ఆ అమ్మాయి టక్కున ఆగి కుమార్ కళ్లల్లోకి ఉరిమి చూసింది.

"నాకు జీవితాంతం మీ బెడ్‌పైన పడుకోవాలని వుంది. మరి మీ ఉద్దేశ్యం తెలుసుకోవచ్చా" ఎలాగైతేనేం చెప్పాల్సిన విషయం తప్పు పోకుండా చెప్పి ఊపిరి పీల్చుకుని, ఆ అమ్మాయి ముఖంలో మారే రంగుల్ని గమనించడం మొదలుపెట్టాడు.

అసలే మొదటి పదంతోటే కోపం తారాస్థాయికి చేరుకున్న ఆ అమ్మాయికి ఈ రెండో డైలాగు పీర ఆవేశాన్ని జోడించింది. అరచేతిని బిగించి కుమార్ చెంపను ఒక్క దెబ్బతో వాయగొట్టి, ఏరా ఇడియట్, నువ్వా, నీ జిడ్డుముఖం. నా బెడ్‌పైన జీవితాంతం నీకు పడుకోవాలని వుందా? యాక్సిడెంట్ అయిన మారుతీకారులాంటి నీ ముఖాన్ని అదుక్కుతినేదికూడా అసహ్యించుకుంటుంది.

అసలు ముందు ముళ్ల పంది ముళ్లకీలాగా నిల్చున్న నీ వెం[ట్రుకలను కుదురుగా దువ్వుకోవడం నేర్చుకో. ఎడాపెడా తిట్ల దండకం చదివేసి కుమార్ తేరుకునేలోగా తన దారిన వెళ్లిపోయిందా అమ్మాయి.

కుమార్‌కు భూమి తల[క్రిందులుగా తిరిగినట్లనిపించింది. వెంటనే బైక్ రియర్ మి[రర్‌లోని తన ముఖం చూసుకున్నాడు. మైదా పిండితో చేసిన పూరీని మించి ఉబ్బిన తన బుగ్గకంటేకూడా తలమీద కులాసాగా ఊగి పలకించిన వెం[ట్రుకలే అతన్ని బాగా రెచ్చగొట్టాయి.

ఆ షాక్‌నుండి తేరుకోవడానికి అతనికి గంట పట్టింది. నీర్సంగా బైక్ స్టార్ట్‌చేసి ఇంటికి వెళ్తూ తనలో తానే అనుకున్నాడు. ఈ చుడీదార్ అమ్మాయిలకి ధైర్యం ఎక్కువ! అయినా ఆ అమ్మాయికి ఎందుకంత కోపమొచ్చింది? తాను డైలాగ్ కరెక్ట్‌గానే చెప్పాడే?! అయినా తిట్టిందంటే ఆ అమ్మాయికి తన డైలాగ్ అర్థమై వుండదు అనుకుని తనని తాను సమర్థించుకున్నాడు.

ఈసారి చీరకట్టిన అమ్మాయిని [ప్రొసీడ్ అయి తన రెండో డైలాగ్ చెప్పాలి. అప్పటిక ప్పుడే నిర్ణయం తీసుకున్నాకగానీ, అతని మనసు తేలిక పడలేదు.

ఆ సమయం రానే వచ్చింది. పాల మరగలాంటి చీర కట్టుకుని బుద్ధిగా తల దించుకుని, ఒద్దికగా నడిచి వస్తున్న కుందన పు బొమ్మనిచూసి, 'నా బిడ్డలకు తల్లిగా మిమ్మల్ని చూడాలని వుంది, మీ ఉద్దేశ్యం సెలవిస్తారా?!' ఆ అమ్మాయి అందానికి తబ్బిబ్బైపోతూ, ఎలాగైతేనేం తప్పుపోకుండా

డైలాగ్ ఒప్పజెప్పాడు కుమార్.

కానీ, "నాకు మాత్రం 'మోహన్' బిడ్డలకు తల్లినవ్వాలని వుందే" వెంటనే సెలవిచ్చిందా కుందనపు బొమ్మ.

మధ్యలో ఈ 'మోహన్' ఎవరు? ఊహించని ఆన్సర్‌కు కన్‌ఫ్యూజ్ అయి ఎదురుప్రశ్నేశాడు కుమార్ తలగోక్కుంటూ.

"మరో రెండు నిమిషాల్లో మీ శరీరంనుండి తోలును వేరుచేయబోయేవాడు, నాకాబోయే మొగుడు" అంటూ ఆ అమ్మాయి రోడ్డు దాటుతున్న ఓ ఆరడుగుల ఆజానుబాహుడిని చూపించింది.


కుమార్ బండి ఎలా స్టార్ట్ చేశాడో ఎలా డ్రైవ్ చేశాడో అతనికే తెలియదు. తూనీగకంటే వేగంగా గాలిలోతేలుకుంటూ మరుక్షణంలో ఇంట్లోకొచ్చిపడి ఊపిరిపీల్చుకున్నాడు.

అమ్మాయిలను చూడగానే వాళ్లింతకు ముందు ప్రేమలో పడిందీ లేనిదీ తెలిసేదెలా! ప్రేమలో పడిన అమ్మాయిలంతా ఓ బోర్డ్ పైన 'ఎంగేజ్డ్' అని రాసుకుని వీపుకు తగిలించుకుంటే నాలాంటి అమాయకులకు సులువుగా వుంటుందికదా! వాళ్ల తెలివితక్కువతనానికి తానిలా పప్పులో కాలేయడంలో పెద్ద విచిత్రమేమీ లేదు. తన తెలివితక్కువ తనాన్ని అతితెలివిగా సమర్థించుకున్నాడు కుమార్.

ఈ చుడీదార్ అమ్మాయిలు చీరలు కట్టిన అమ్మాయిలు పైకి అమాయకంగా కనపడతారుకానీ, వాళ్ల వెనుక చాలా హిస్టరీ వుంది. వీళ్లందరికంటే జీన్స్‌పాంట్ అమ్మాయిలే నయం. పైకి రాష్‌గా కనపడినా మనసు సున్నితం. కొత్త సిద్ధాంతం కనిపెట్టి, ఈసారి జీన్స్ ప్యాంట్ బేబీని ఆరు మూరైనా మూరు ఆరైనా లైన్లో పెట్టాలని శపథం చేశాడు కుమార్.

బస్టాప్‌లో నుంచుని వున్న జీన్స్ పాంట్ అమ్మాయిని చూసి అద్దంలో చూసుకుని ఓసారి జుట్టు సవరించుకుని, అమ్మాయివైపు అడుగులు వేశాడు కుమార్.

"ఇఫ్ యు డోంట్ మైండ్, శుభలేఖలో



నా పేరుకింద మీ పేరును చూడాలని వుంది... వాడ్దాయూ సే?!" పళ్లను మెరిపించాడు కుమార్.

ఆ అమ్మాయి ఆ మాట వినగానే మొదట చిరునవ్వు నవ్వింది. ఆ తర్వాత తన పర్సు తెరిచి చేతిలోకి ఏదో తీసుకుంది.

ఏం ఇవ్వబోతోంది. తనకు ఈ అమ్మాయి. తన విజిటింగ్ కార్డా!? అంటే ఈ అమ్మాయికి తాను నచ్చినట్టేగా? భలే ఛాన్సులే. ఇక ఈ అమ్మాయితో పార్కులు, సినిమాలు, షికార్లు... ఊహాల్లో తేలిపోయాడు కుమార్.

చేతిలో ఏదో తగలడంతో వాస్తవంలోకి వచ్చి తన చేతిలోని కవర్లోంచి కార్డుని అనాలోచితంగా బైటికి తీసి అయోమయంగా ఆ అమ్మాయిని చూశాడు.

"నెక్స్ట్‌వీక్ నా మేరేజ్. ఇప్పటికే నా పేరు మరొకరితో శుభలేఖలో వచ్చేసింది. గుడ్‌లక్ నెక్స్ట్‌టైమ్" తన బస్ రావడంతో చెయ్యిఊపి పరిగెత్తిందా జీన్స్‌ప్యాంట్ జూలీ.

అసలీ అమ్మాయిలెప్పుడూ ఇంతే. ఎప్పటికీ ఎవరికీ అర్థంకారు. విసుక్కుని, ఇక తాను ప్రేమలోపడడం అసంభవం. విషయాన్ని చివరకుతేల్చుకున్నాడు కుమార్.

○ ● ○

కుమార్ అమ్మాయిలవెంట పడుతున్నాడని అతని స్నేహితులద్వారా విన్న అతని తండ్రి కుమార్‌కు తన చెల్లెలి కూతురితో పెళ్లి ఖాయం చేశాడు.

రంగరంగవైభవంగా పెళ్లిజరిగిపోయింది. ఇంతకూ నా మరదలైనా నాకు అర్థం అవుతుందో లేదో అని ఆలోచిస్తూ కన్ఫ్యూజ్ అయి మూడుకు బదులు ఆరు ముళ్ళేశాడు కుమార్.

శోభనం గదిలోకి పాలగ్లాసుతో అడుగుపెట్టిన మరదలు లక్ష్మిని చూసి ఆమె అందానికి నిజంగానే ముగ్ధుడయ్యాడు కుమార్. ఇంత అందమైన మరదల్ని కళ్లెదురుగా పెట్టుకుని లేనిపోని అమ్మాయిలతో పడరాని పాట్లు పడి, అనరాని మాటలు అనిపించుకున్నాడు తను. ఇప్పట్నుండి సిన్సియర్‌గా లక్ష్మినే ప్రేమించేయాలని అనుకున్నాడు మనసులో కుమార్.

సుబ్బారావు ఆలోచనలను దూరం చేస్తూ లక్ష్మి వంగి అతని కాళ్లను చేతులతో తాకి కళ్లకు అద్దుకుంది.

"ఆహా ఏం వినయం! నా మరదలికి చాలా మర్యాదలు తెల్సే" గర్వపడి లక్ష్మిని లేపి మంచంపై కూర్చోపెట్టి, తమలపాకుల్లాంటి ఆమె చేతివ్రేళ్లను పరవశంగా కళ్లు మూసుకుని ముద్దుపెట్టుకుంటూ "ఏమైనా మాట్లాడు లక్ష్మీ" అన్నాడు.

"ప్రతిరాత్రి నీతో పడుకోవాలన్న నా కోరిక ఈ రోజునుండి తీరబోతోంది బావా!" చేతిని అతని మెడచుట్టూ వేసి దగ్గరకు జరుగుతూ మొదటి మాట మాట్లాడింది లక్ష్మి.

వాక్యం పూర్తయి, పూర్తవ్వకముందే కీచుగా అరచి, వెనక్కి విరుచుకుపడిపోయాడు కుమార్! పాపం. కుమార్!!